పల్లెల్లో గజ గజ

- అటు పంట పొలాలు తొక్కి.. ఇటు మనుషుల ప్రాణాలను తీస్తున్న ఏనుగులు
- వణుకుతున్న అటవీ సమీప గ్రామాలు
- గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో తీవ్ర నష్టం

జిల్లాలో గజ విధ్వంసం ఆగడం లేదు. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట పంటలను తొక్కి నాశనం చేస్తూనే ఉన్నాయి. అదే సమయంలో మనుషులు కంట పడితే దాడి చేసి చంపేస్తున్నాయి. మానవ తప్పిదాలతో ఏనుగులూ మృత్యు వాత పడుతున్నాయ. అడవుల నుంచి ఏనుగులు రాకుండా కట్టడి చర్యలు చేపట్టడంలో గత ప్రభుత్వం విఫలమైంది. ఫలితం అటవీ సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాజాగా శనివారం రాత్రి రామకుప్పం మండలంలో రైతు కన్నా నాయక్ ఒంటరి ఏనుగు దాడిలో అసువులు బాశారు.

\- రామకుప్పం







1. కావలిమడుగు వాగు వద్ద ఏర్పాటు చేసిన సిమెంటు పిల్లర్లు
2. ఎస్.గొల్లపల్లె సమీపంలో పూడిపోయిన కందకం
3. ననియాల వద్ద పూడిపోయిన కందకం గుండా దారి ఏర్పాటు చేసుకున్న ఏనుగులు

అయ్యో.. కన్నా

ఒంటరి ఏనుగు దాడిలో మరో రైతు బలి





ఏనుగుల దాడి చేయడంతో రోడ్డు పక్కన పడిన కన్నానాయక్ మృతదేహం (ఫైల్ ఫోటో)

కన్నా నాయక్ ఉండేది రామకుప్పం మండలం పీఎంకే తాండా. ఒకటిన్నర కిలోమీటరు దూరంలోని పీఎం తాండా సమీపంలో పొలాలున్నాయి. ఎప్పటిలా శనివారం రాత్రి పొలంలోని షెడ్డులో ఆవులు కట్టేసి వస్తున్న ఆయన ఒంటరి ఏనుగు దాడికి బలయ్యారు. అటవీ సమీప గ్రామమైన ఈ తాండాలో తరచూ పంటపొలాలపై ఏనుగులు దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి పది గంటల ప్రాంతంలో ఒంటరి ఏనుగు పీఎం తాండా సమీపంలోని కుమారనాయక్ టమోటా తోటను తొక్కి నాశనం చేస్తోంది. అదే సమయంలో ఆవులు కట్టేసి వస్తున్న కన్నా నాయక్.. ఒంటరి ఏనుగును చూసి భయంతో పరుగు తీశారు. ఆ క్రమంలో కింద పడిన ఆయనపై ఏనుగు దాడి చేసింది. తొండంతో విసిరి కొట్టింది. దీంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందారు. ఎప్పటికీ కన్నా నాయక్ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెదికారు. ఒకవేళ ఏనుగులు రావడంతో ఎక్కడైనా దాక్కుని ఉంటారని భావించారు. ఆదివారం ఉదయం పొలాలవైపు వెళ్తున్న పీఎం తాండాకు చెందిన కొందరు కన్నా నాయక్ మృతదేహాన్ని చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. జిల్లా అటవీ అధికారి చైతన్య కుమార్, కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్, కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిస్వామి, పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి పత్రా నారాయణ,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, నేతలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కన్నానాయక్ కుటుంబానికి డీఎఫ్‌వో చైతన్యకుమార్ రూ.5 లక్షల చెక్కును అందజేశారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్తులు ఆయనకు విజ్ఞప్తి చేశారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా తోట

జిల్లాలో ఏనుగుల దాడులు నిత్యకృత్యంగా మారాయి. పంట పొలాలను తొక్కి నాశనం చేస్తూ రైతులను నష్టాల పాలు చేస్తున్నాయి. ఐదేళ్లుగా పాలకుల పాపం ఇటు రైతులకు, అటు ఏనుగులకూ శాపంగా మారింది. దశాబ్దం కిందటి వరకు పలమనేరు,కుప్పం నియోజక వర్గాల్లో ఏనుగుల దాడులు ఎక్కువగా ఉండేవి. 1999 లో వీటి నివారణకు టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టది. రెండు నియోజకవర్గాల పరిధిలో అటవీ సరిహద్దుల గుండా సుమారు 125 కిలోమీటర్ల సోలారు విద్యుత్తు కంచె ఏర్పాటు చేసింది. తద్వారా అడవుల నుంచి ఏనుగులు బయటకు రాకుండా నిరోధించగలిగారు. తర్వాత పదేళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్.. సోలార్ విద్యుత్ కంచె నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో అడవుల్లో నుంచి జనావాసాల్లోకి ఏనుగులు రావడం ఎక్కువైంది. వందలాది ఎకరాల్లో పంటలు ధ్వంసం చేస్తున్నాయి. గజ దాడుల్లో పదులసంఖ్యలో రైతులు మృతి చెందారు. వేటగాళ్లు, రైతులు ఏర్పాటు చేసిన చేసిన విద్యుత్ తీగల ఉచ్చులకు చిక్కుకుని సుమారు పది ఏనుగులు మృత్యువాత పడ్డాయి. అలాగే, పొలాలు, అటవీ ప్రాంతంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు తీగలు తగిలి.. రక్షణ చర్యల్లేని ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల కొన్ని ఏనుగులు చనిపోయాయి.

మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చాక..

2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో ఇక్కడ రైతులను, పంటలను గజదాడుల నుంచి కాపాడేందుకు చర్యలు చేపట్టింది. సోలార్ విద్యుత్ కంచెకు మరమ్మతులు చేపట్టింది. అటవీ సరిహద్దుల్లో కందకాలు తవ్వించింది. వాగులు, వంకలు ఉన్న చోట ఏనుగులు అడవి నుంచి బయటకు రాకుండా కాంక్రీట్ దిమ్మెలు నిర్మించింది. దీంతో చాలావరకు ఏనుగుల దాడులు తగ్గాయి.

ఐదేళ్లలో నిర్లక్ష్యం : 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. కందకాల నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో వర్షాల కారణంగా కందకాలు పూడిపోయాయి. కాంక్రీటు దిమ్మెలు నిర్మించిన చోట జల ప్రవాహంతో దారులు ఏర్పడ్డాయి. దీంతో నాలుగేళ్లుగా కుప్పం, పలమనేరు, చిత్తూరు నియోజకవర్గాల్లోని అటవీ సమీప ప్రాంతాల్లో పంటలపై గజదాడులు మొదలయ్యాయి. పుంగనూరు నియోజకవర్గంలోని సోమల, సదుం, పులిచెర్ల మండలాల్లో ఏనుగుల దాడులు తీవ్రమయ్యాయి. గత ప్రభుత్వంలో అటవీశాఖ మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలోనూ ఏనుగుల దాడులు పెరిగినా ఏమాత్రం పట్టించుకోలేదు. కాగా, ఈ ఐదేళ్లలో పలుచోట్ల జరిగిన ఏనుగుల దాడుల్లో 14మంది మృతిచెందారు. విద్యుత్ తీగలు తగిలి 13, రోడ్డు ప్రమాదంలో మూడు వంతున ఏనుగులు మృత్యువాత పడ్డాయి. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ ఏనుగుల కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అటవీ సమీప ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నివేదికలు పంపుతాం

గజదాడుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని జిల్లా అటవీ అధికారి చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో ఏనుగుల దాడులు ఎక్కువగా ఉన్నాయన్నారు.అన్ని చోట్లా సోలార్ విద్యుత్ కంచెలు ధ్వంసమయ్యాయని, కందకాలు పూడిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సోమలలో ఆగని గజదాడులు

సోమల, జూన్ 16: సోమల మండలంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి చిన్నఉప్పరపల్లె పంచాయతీ వినాయకపురం సమీపంలోని టమోటా, చెరకు పంటల్లో స్వైరవిహారం చేశాయి. బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. టమోటా పండ్లు తిన్నంతా తినేసి.. చెట్లకు ఊతంగా నాటిన కర్రలను కిందకు తోసేశాయి. కోతకు సిద్ధంగా ఉన్న టమోటా, మామిడి తోటలను ఏనుగులు తొక్కివేయడంతో కడుపు కోత మిగిలిందని పేటూరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల సంచారంపై పుంగనూరు రేంజర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు సంచారంతో టమోటా తోటల్లో కాయల కోతలు జరగడంలేదన్నారు. కొందరు రైతులు జట్లుగా ఏర్పడి టపాసులు కాలుస్తూ.. డప్పుల శబ్దం చేస్తూ.. మంటలు వేసుకుని పొలాల వద్ద జాగరణ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.



వినాయకపురం వద్ద ఏనుగుల గుంపు విరిచేసిన చెరకు తోట

పాతపేటలో గజ బీభత్సం

కల్లూరు, జూన్ 16: పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. పాతపేట సమీపానికి చేరుకున్న ఏనుగుల గుంపు ఘీంకారాలు చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్లలోంచి రావడానికి వణికిపోయారు. శ్రీరాములు, రఘుపతి, జయమ్మ, బాలసుబ్రమణ్యం తదితర రైతుల పొలాల్లోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు మామిడిచెట్లను విరిచేశాయి. టమోటా పంటను ఇష్టానుసారంగా తొక్కేశాయి. డ్రిప్ పైపులు, రాతికూసాలను విరగ్గొట్టాయి. పశుగ్రాసాన్ని తొక్కి నాశనం చేశాయి. కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి.



కొబ్బరి చెట్టును పెకలించిన ఏనుగులు

రెస్కో పాపంలో విచారణాధికారికీ వాటాయేనా!

- అసిస్టెంట్ హెల్పర్‌గా డివిజనల్ కో ఆపరేటివ్ సమీప బంధువుకు ఉద్యోగం



కుప్పం, జూన్ 16: కుప్పం రెస్కో (కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ)లో తవ్వేకొద్దీ అవినీతి పుట్టలు బయట పడుతున్నాయి. రెస్కోలో జరిగిన ఉద్యోగ నియామకాలలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ అందిన ఫిర్యాదు మేరకు విచారణాధికారిగా నియమితులైన సబ్ డివిజనల్ స్థాయి అధికారికి కూడా ఇందులో వాటా ఉన్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈయన సమీప బంధువుకు గతంలో జరిగిన నియామకాలలో ఉద్యోగం లభించిందని విస్తృతంగా ప్రచారమవుతోంది.

కుప్పం రెస్కోలో జరిగిన ఆరుగురి కారుణ్య నియామకాలు, 19 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణలో అవకతవకలు చోటు చేసుకున్నాయని శాంతిపురం మండలం తుమ్మిశి రోడ్డు దొంకుమానిపల్లె గ్రామానికి చెందిన వినియోగదారుడు ఎ.నగేశ్ చేసిన ఫిర్యాదుతో విచారణ ప్రారంభమైన విషయం తెలిసిందే. కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, పలమనేరు సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ అయిన కుమార్ ఆనందన్ ఈనెల 14వ తేదీన రెస్కోలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎండీ సుబ్రమణ్యం విచారణకు హాజరు కాకపోవడంతో కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మరికొన్ని రికార్డులు అవసరమని, వాటిని వెంటనే తనకు చేర్చాలని రెస్కో అధికారులను ఆదేశించి వెళ్లారు. ఇప్పుడు విచారణాధికారి కుమార్ ఆనందన్ మీదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన సమీప బంధువు ఒకరు రెస్కోలో జరిగిన అక్రమ నియామకాల ద్వారా ఉద్యోగం పొందారన్న ప్రచారం జోరందుకుంది.

ఇలా జరిగింది

వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్లలో రెస్కోలో పలు ఉద్యోగాలను భర్తీ చేశారు. ఫిర్యాదుదారుడు పేర్కొన్న పదోన్నతులు, కారుణ్య నియామకాలే కాకుండా ప్రభుత్వం దిగిపోయే ఆరేడు నెలల ముందు సుమారు 150 మందిని అసిస్టెంట్ హెల్పర్లుగా తీసుకున్నారు. ఈ నియామకాలు కో ఆపరేటివ్ చట్టానికి, నిబంధనలకు వ్యతిరేకంగా జరిగాయన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. రూ.లక్షల్లో చేతులు మారాయని చెబుతున్నారు. ఇంత పెద్దయెత్తున అక్రమ నియామకాలు జరుగుతుంటే ఉన్నతాధికారులు ఎందుకు చూస్తు ఉండిపోయారన్న ప్రశ్నకు ఇప్పుడు సమాధానం దొరుకుతోంది. ఆయా ఉన్నతాధికారుల అస్మదీయులకు ఉడతా భక్తి ముడుపుల సమర్పణతో పాటు, సమీప బంధువులైన యువకులకు గుంపులో గోవిందలా ఉద్యోగాలు కట్టబెట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు విచారణాధికారికి సమీప బంధువైన ఒక యువకుడికి వి.కోట రెస్కో కార్యాలయంలో అసిస్టెంట్ హెల్పర్‌గా ఉద్యోగం లభించినట్లు తెలిసింది. ఇతడు ప్రతిరోజూ పలమనేరునుంచి వి.కోటకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా ఇటువంటి 'అధికారిక' నియామకాలు ఎన్ని జరిగాయో ప్రస్తుతానికి బయటకు రావడంలేదు.

అధికార పార్టీ కూడా బోల్తా పడిందా?

రెస్కోలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేయడం తప్ప, విచారణాధికారిగా ఎవరిని నియమిస్తున్నారన్న దానిపై అధికార టీడీపీ దృష్టి పెట్టలేదు. అక్రమ ఉద్యోగ నియామకాల పాపంలో భాగం ఉందన్న ఆరోపణలు ఎదుర్కుంటున్న అధికారిని విచారణాధికారిగా నియమించినా పట్టించుకోలేదు. ఈ విషయం రెస్కో అక్రమాలను తెరమీదికి తెచ్చిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు తెలుసో లేదో తెలియదు. ఇంకో ముఖ్యమైన అంశమేమిటంటే, రెస్కోలో జరిగిన అక్రమ నియామకాలు, పదోన్నతులపై ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే ఫిర్యాదు దారుడు కో ఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన అదే నెల 26వ తేదీన ఆ ఫిర్యాదును జిల్లా కో ఆపరేటివ్ అధికారికి పంపారు. ఆయనేమో తీరిగ్గా ఏప్రిల్ 6వ తేదీన డివిజనల్ కో ఆపరేటివ్ అధికారికి ఫార్వర్డ్ చేశారు. చివరకు ప్రభుత్వం మారిన తర్వాతనే విచారణ ప్రారంభమైంది. ఇన్ని నెలలు ఫిర్యాదును ఎందుకు తొక్కిపెట్టారన్న ప్రశ్నకు, అప్పట్లో అధికారులకు కూడా ఈ అక్రమాలలో వాటా ఉన్నందునే అన్న సమాధానం చెప్పుకుంటే ఆక్షేపించాల్సిన పని లేదు. ఇప్పుడు ఈ వాస్తవాలు బయట పడ్డ తర్వాత విచారణాధికారిని మారుస్తారా? లేదా ఆయన్నే కొనసాగిస్తారా అన్నది ఉన్నతాధికారుల విచక్షణపై ఆధారపడి ఉంది. కాగా, కుమార్ ఆనందన్ సమీప బంధువుకు ఉద్యోగం ఇచ్చిన విషయంపై రెస్కో ఎండీ ప్రభాకర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఆ విషయం తనకు తెలియదని, విచారించి తెలుసుకుంటానని చెప్పారు.

వరసిద్ధుడి దర్శనానికి మూడు గంటలు



కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి ఆదివారం సుమారు మూడు గంటల సమయం పట్టింది. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు స్వామి దర్శనార్థం విచ్చేయడంతో క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

\- ఐరాల(కాణిపాకం)

తోతాపురి టన్నుకు రూ.30వేలివ్వండి

- సీఎం చొరవతో పల్ప్ ఫ్యాక్టరీలకు కలెక్టర్ల ఆదేశాలు
- ధరల పతనంపై చంద్రబాబు దృష్టికి చంద్రగిరి ఎమ్మెల్యే తీసుకెళ్లడంతో కదలిక



తిరుపతి, ఆంధ్రజ్యోతి/చిత్తూరు కలెక్టరేట్: 'తోతాపురి మామిడి టన్నుకు రూ.30 వేల చొప్పున చెల్లించాలి. అంతకన్నా తక్కువ ఇస్తే చర్యలు ఉంటాయి' అంటూ పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలను చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు షన్మోహన్, ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఆదేశించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో వీరు స్పందించారు. మామిడి ధరల పతనంపై రైతుల ఆందోళనను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ ప్రయోజనం కలగనుంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.87 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. చిత్తూరు జిల్లా పరిధిలో 1.50 లక్షల ఎకరాలు, తిరుపతి జిల్లా పరిధిలో 1.37 లక్షల ఎకరాలు చొప్పున వుంది. ఉమ్మడి జిల్లాలో సాగయ్యే మామిడి పంటలో 90 శాతం తోతాపురి రకం కాగా.. మిగిలిన పది శాతం టేబుల్ వెరైటీలుగా పేర్కొనే బేనీషా, మల్‌గూబా తదితర రకాలున్నాయి. టేబుల్ వెరైటీలకు ఏటా మంచి ధరే పలుకుతుండగా 90 శాతం సాగయ్యే తోతాపురి మాత్రం దిగుబడి యావత్తూ జిల్లాలోని 30 పల్ప్ ఫ్యాక్టరీలపై ఆధారపడి ధరలు పలుకుతుంటాయి. సాధారణ స్థితిలో ఎకరాకు 8-10 టన్నుల దిగుబడి రావాలి. అయితే ఈసారి ప్రతికూల పరిస్థితులతో దిగుబడి తగ్గింది. అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మామిడి నేలరాలింది. అందువల్ల ప్రస్తుత సీజన్‌లో ఎకరాకు ఒకటి నుంచి రెండు టన్నుల్లోపే దిగుబడి వచ్చింది. దామలచెరువు, చిత్తూరు, బంగారుపాళెం, తిరుపతిలో మండీలతో కూడిన మార్కెట్లు వుండగా.. వ్యాపారులు అధికారికంగా దిగుబడి కొనుగోలు చేసే ర్యాంపులు 30 దాకా వున్నాయి. వీటిలో టన్నుకు రూ.19వేల నుంచి 21వేల వరకూ ధర పలుకుతుండగా.. ఒక్క జైన్ పల్ప్ ఫ్యాక్టరీ మాత్రం రూ.23వేల చొప్పున చెల్లిస్తోంది. అసలే దిగుబడి తగ్గిపోయి ఆదాయం కోల్పోతున్న రైతులు వచ్చిన కొద్దిపాటి దిగుబడికి కూడా తగిన ధర పలకక పోవడంతో తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. టన్నుకు రూ.30వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, వ్యాపారులు స్పందించకపోవడంతో మామిడి రైతులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని ఆశ్రయించారు. ధరల పతనంపై మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన మామిడి రైతుల గోడు నేరుగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చొరవతో రెండు జిల్లాల కలెక్టర్లూ రంగంలోకి దిగారు. తోతాపురి రకం మామిడి టన్నుకు రూ.30వేల చొప్పున ధర చెల్లించాలని పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి చిత్తూరు కలెక్టర్ షన్మోహన్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాలుగైదు రోజులుగా మామిడి ధరల పతనంపై అధికారుల నుంచి వివరాలు అడిగితెలుసుకున్నారు.

మామిడి నేలచూపులు

- టన్నుకు రూ.8 వేలు తగ్గిన ధర

పెనుమూరు, జూన్ 16: జిల్లాలో మామిడి ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయి. గడిచిన వారం టన్ను రూ.30 వేలు ఉండగా ఆదివారం రూ.22 వేలకు పడిపోయింది. జిల్లాలో 58వేల హెక్టార్లలో మామిడి సాగు కొనసాగుతుండగా ఈ ఏడాది దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో 4-6 టన్నుల దిగుబడి వస్తుండగా, ఈ ఏడాది రెండు టన్నులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. పంట 30శాతం కూడా రాకపోవడంతో ధరలు బాగుంటాయని రైతులు ఆశపడ్డారు. వారం రోజుల వరకు బాగానే ఉన్న ధర ఒక్కసారిగా తగ్గిపోవడంతో నిరాశకు గురయ్యారు. గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్ కావడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని భావిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి, గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధరలు తగ్గకుండా చూడాలి



ఈ ఏడాది కాపు అంతంతమాత్రంగానే ఉంది. గత వారంలో గుజ్జు పరిశ్రమలు తోతాపురి రకానికి టన్నుకు రూ.30 వేలు ఇచ్చారు. కోత దశకు చేరుకుంటున్న సమయంలో ధర పతనమైపోయింది. దీనికి కారణం ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్ అవ్వడమే. అధికారులు ఆదుకోవాలి.

\- హరిబాబునాయుడు, రైతు, మఠంపల్లి

కాపు తగ్గడంతో నష్టపోవాల్సి వస్తోంది



15 ఏళ్ల నుంచి మామిడి వ్యాపారం చేస్తున్నాను. తోటలను కొని కాయలు ఫ్యాక్టరీలకు తోలేవాడిని. ఈ ఏడాది 5సార్లు మందులు కొట్టి, దుక్కి దున్నినా కాపు రాలేదు. రైతులు మాత్రం ముందు మాట్లాడిన డబ్బే ఇవ్వాలని అడుగుతున్నారు. మరోవైపు ఫ్యాక్టరీల యజమానులు ఏకమై ధరలను తగ్గించేశారు. ఈసారి నష్టం తప్పదేమో.

\- భాస్కర్, వ్యాపారి



తిరుమలలో తరగని రద్దీ

మెలికలు తిరిగిన క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు



సీఆర్వో వద్ద గుమికూడిన భక్తులు

తిరుమలలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి ఆలయ పరిసరాలు, మాడవీధులు, బస్టాండ్, లేపాక్షి సర్కిల్, లడ్డూ కౌంటర్, పాపవినాశనం, శ్రీవారిపాదాలు వంటి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మరోవైపు అలిపిరి, శ్రీవారిమెట్ల మార్గాల్లో భక్తులు అధిక సంఖ్యలో కొండకు తరలివస్తున్నారు. గదులకు డిమాండ్ కొనసాగుతుండటంతో భక్తులు కార్యాలయాల ముందు, షెడ్లు, చెట్లకింద, ఫుట్‌పాత్‌లపై సేదతీరుతున్నారు. గదుల కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. కల్యాణకట్టల్లోనూ యాత్రికుల సందడి నెలకొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నాదనీరాజనం ముందున్న షెడ్‌లో సేదతీరుతున్న యాత్రికులు

టీటీడీ ఈవోగా శ్యామలరావు

బాధ్యతల స్వీకరణ

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో(కార్యనిర్వహణాధికారి)గా శ్యామలరావు ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఈవోగా నియమితులైన ఆయన తన సతీమణితో కలిసి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ తొలుత వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడినుంచి నేరుగా వైకుంఠ క్యూకాంప్లెక్స్‌కు వెళ్లారు. క్యూలైన్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన రంగనాయమండపంలో టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) ధర్మారెడ్డి నుంచి బాధ్యతలను అందుకున్నారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరిగి రంగనాయక మండపానికి చేరుకున్న నూతన ఈవో దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. తర్వాత జేఈవో వీరబ్రహ్మం శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.



నూతన టీటీడీ ఈవోకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న జేఈవో వీరబ్రహ్మం



శ్రీవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న శ్యామలరావు



భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న ఈవో

నీటిలో మట్టిలా కనిపిస్తోంది

క్యూలైన్‌లో ఉన్న భక్తులకు ఇచ్చే నీటిలో కొంచెం మట్టిలా కనిపిస్తోందని, దీనిపై పరిశీలన చేస్తామని ఈవో అన్నారు. క్యూలైన్ల పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పాలు అన్ని చోట్లా ఇవ్వడం లేదనే ఫిర్యాదులు క్యూలైన్లలోని భక్తుల నుంచి అందాయన్నారు. అధికారులతో సమీక్షించి.. పాలు, టీ పంపిణీపై కూడా దృష్టిసారిస్తామన్నారు. నడిచి వచ్చే భక్తులకు టోకెన్లు ఇవ్వడం లేదని ఫిర్యాదులు కూడా వచ్చాయని, దీన్ని అధిగమిస్తామని చెప్పారు. ఇక, శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ క్యూలైన్లు భారీగా పెరిగిపోవడంపైనా పరిశీలన చేస్తామని తెలిపారు.

అన్నప్రసాదాల తనిఖీ

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని ఈవో శ్యామలరావు తనిఖీ చేశారు. రాత్రి అన్నప్రసాద భవనానికి చేరుకున్న ఆయన అన్నప్రసాదాలు స్వీకరించారు. తర్వాత వంటశాల, స్టోర్ గదిని పరిశీలించారు. అలాగే భక్తుల క్యూలైన్, వారికి అన్నప్రసాదాలు అందే తీరున.. నాణ్యతను గమనించారు.

తొలిరోజే క్యూలైన్ల పరిశీలన

ఈవోగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే తిరుమలలో భక్తుల రద్దీ నెలకొన్న విషయాన్ని శ్యామలరావు తెలుసుకున్నారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, ఇతర అధికారులతో కలిసి రింగురోడ్డులో వ్యాపించి ఉన్న క్యూలైన్ వద్దకు వెళ్లారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు అందించే సదుపాయాలను పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. ఎక్కడినుంచి వచ్చారు, క్యూలైన్‌లో ఎంత సేపటినుంచి ఉన్నారు.. అన్నప్రసాదాలు, తాగునీరు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. అన్నప్రసాదాలు, తాగునీటి నాణ్యతను గమనించారు. అలాగే నారాయణగిరి షెడ్లను కూడా పరిశీలించి.. సర్వదర్శన భక్తులతో మాట్లాడారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక న్యాయమూర్తులు



జస్టిస్ అశోక్‌కినాగి, సుమలత, హరిష్‌కుమార్‌లకు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూన్ 16: కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. జస్టిస్ హరీష్‌కుమార్, జస్టిస్ అశోక్.ఎన్‌కినాగి, జస్టిస్ సుమలత విడివిడిగా ఆలయానికి చేరుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై టిప్పర్ బోల్తా



గంగాధరనెల్లూరు, జూన్ 16: మండలంలోని ముసలయ్యగారిపల్లె వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైవే బ్రిడ్జిపై నుంచి పాత రోడ్డుపై టిప్పర్ బోల్తాపడింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు - తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ముసలయ్యగారిపల్లె వద్ద బ్రిడ్జిపైన కంకర రాళ్లు తీసుకెళుతున్న టిప్పర్ అదుపుతప్పి పాత రోడ్డుపై బోల్తాపడింది. ఇంజన్, క్యాబిన్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని గంగాధరనెల్లూరు ఏఎస్ఐ ఆంజినేయులురెడ్డి తెలిపారు.

బావిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



గుణశేఖర్ మృతదేహం

పెనుమూరు, జూన్ 16: బావిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సన్యాసిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి స్నేహితులు, పోలీసుల కథనం మేరకు.. సన్యాసిపల్లికి చెందిన గుణశేఖర్(45) చిత్తూరు ఆర్టీసీ డిపో-2లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి తమ వ్యవసాయ బావి వద్ద మద్యం తాగారు. స్నేహితులతో మాట్లాడుతుండగానే బావిలో దూకేశాడు. ఇద్దరు స్నేహితుల్లో ఒకరికి ఈత రాకపోవడం, మరొకరు బావిలో దూకి ఎంత ప్రయత్నించినా గుణశేఖర్ కనిపించలేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి అతని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. కాగా, మృతుడి భార్య 2019లో ఆత్మహత్య చేసుకుంది. పిల్లలు లేరు. బతుకు మీద విరక్తి కలుగుతోందని అప్పుడప్పుడూ గుణశేఖర్ చెబుతుండేవాడని స్నేహితులు పేర్కొన్నారు.

నిందితుడితోపాటు సీఐపైనా

కేసు నమోదుకు కోర్టు ఆదేశం

తిరుపతి(లీగల్), జూన్ 16: గతేడాది సెప్టెంబరులో జరిగిన ఉంగరం చోరీ కేసులో నిందితుడితోపాటు, అప్పటి ఈస్ట్ పోలీసు స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేయాలని రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సీహెచ్ కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. తిరుపతిలోని ఓ రెస్టారెంట్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఫొటోలతో ఉన్న 36గ్రాముల బంగారు ఉంగరాన్ని టీడీపీకి చెందిన స్థానిక టీఎన్‌టీయూసీ నాయకుడు జయరామిరెడ్డి పోగొట్టుకున్నారు. దీనిపై ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ పట్టించుకోలేదని, నిందితున్ని పట్టుకుని వదిలేశారని జయరామిరెడ్డి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించి నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు సీఐ మహేశ్వర్‌రెడ్డిని ఏ2గా చేర్చి కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బాధితుడి తరపున న్యాయవాదులు వెంకటకుమార్, విద్యానాథ్‌రెడ్డిలు వాదనలను వినిపించారు.

23 ఏళ్ల తర్వాత 'కారుణ్యం'!

పెద్దిరెడ్డి చెప్పారని డీసీసీబీలో నిబంధనల విరుద్ధంగా పోస్టింగ్ ● ఆలస్యంగా వెలుగు చూసిన వ్యవహారం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16: వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలన గాడితప్పింది. పాలకవర్గానికి చేస్తున్న తప్పులు ఎత్తిచూపాల్సిన అధికారులు వారి మెప్పుకోసం వత్తాసు పలికారు. ఆ అంశాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారంటూ 23ఏళ్ల తర్వాత ఓ ఉద్యోగి కుమారుడికి జీవో నెం. 1005 కింద కారుణ్య ఉద్యోగం ఇచ్చినట్లు తెలిసింది. నాలుగేళ్ల కిందట జరిగిన ఈ విషయం తాజాగా వెలుగు చూసింది. డీసీసీబీ పుంగనూరు బ్రాంచ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసిన డి.జయరామ్ 1997 అక్టోబరు 6న మృతిచెందారు. కారుణ్య నియామకాల కింద మృతుడి కుటుంబ సభ్యులకు అర్హతను బట్టి ఏడాది కాలపరిమితిలో దరఖాస్తుల ఆధారంగా ఉద్యోగం ఇవ్వవచ్చు. ఇది నిబంధన. అప్పట్లో కుటుంబ సభ్యులు చేసుకున్న దరఖాస్తును బ్యాంకు అధికారులు అనర్హుడంటూ పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా మృతుడి కుమారుడు డి.జయప్రకాష్ ఇటీవలి పెద్దిరెడ్డివర్గానికి దగ్గరయ్యాడు. దాంతో మంత్రి పెద్దిరెడ్డి నోటిమాటతో.. నిబంధనలకు విరుద్ధంగా కుప్పం బ్యాంక్ బ్రాంచ్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా 2020 మే4వ తేది ఉద్యోగం ఇచ్చారు. తొలుత అనర్హుడని పోస్టింగ్ ఇవ్వని అధికారులు, 23 ఏళ తర్వాత ఆ వ్యక్తి అర్హుడంటూ పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ఆ మేర బోర్డు మీటింగ్‌లో తీర్మానం చేసి రహస్యంగా ఆమోదం తెలిపింది. ఈ వ్యవహారంపై కలెక్టర్ షన్మోహన్ విచారణ కమిటీ వేసి నిజాలు నిగ్గుతేల్చాలని టీడీపీకి అనుబంధమైన ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత ఐదేళ్లలో బ్యాంకులో జరిగిన అవకతవకలు, ఇష్టారాజ్యంగా రుణాల వితరణ వంటి అంశాలను బయటకు తీసేపనిలో టీడీపీ నాయకులు నిమగ్నమైనట్లు తెలిసింది.

ఆలయంలోకి దళితుల నిషేధం

● పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు అగ్ర కులస్తుల దాడి
● కుప్పంలో ఉద్రిక్తం

కుప్పం, జూన్ 16: నాగరిక సమాజంలో ఇంకా దళితులపై నిషేధాలు, దాడులు కొనసాగుతున్నాయి. జాతర సందర్భంగా ఆలయంలోకి ప్రవేశించబోయిన దళితులను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారు. కుప్పం పురపాలక సంఘం బండశెట్టిపల్లెలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా ఉద్రిక్తతను సృష్టించింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బండశెట్టిపల్లెలో ఈ నెల 11వ తేదీన జాతర జరిగింది. అదే గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు పూజ చేసుకోవడానికి ఆలయం వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న అగ్ర కులస్తులు కొందరు వారిని అడ్డుకున్నారు. తమతో సమానంగా దళితులకు ఆలయంలోకి ప్రవేశం లేదని, బయటే పూజలు చేసుకొమ్మని ఆదేశించారు. దీనిపై గ్రామంలో చాలా సార్లు పంచాయితీలు జరిగాయి. గ్రామంలోని ఏ ఆలయానికీ దళితులకు ప్రవేశం లేదంటూ అగ్రకులాలు తీర్మానం చేశారు. దీంతో మొత్తం ఘటనపై దళితులు కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన అగ్ర కులానికి చెందిన మునీంద్ర అనే యువకుడు, ఆదివారం రాజవేలు అనే దళిత యువకుడిపై దాడిచేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అర్బన్ ఎస్ఐ సుబ్బారెడ్డిని వివరణ కోరగా, దళితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సంఘటనపై విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



గాయపడిన రాజవేలు





వి.కోటలో బైక్ రేసింగ్

వి.కోట, జూన్ 16: వి.కోట సమీపంలోని దాసార్లపల్లె వద్ద ఆదివారం బైక్‌రేసింగ్ నిర్వహించారు. దీనికోసం పొలాన్ని సిద్ధం చేశారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, గోవా నుంచి సుమారు 65 మంది జాతీయస్థాయి బైక్ రేసర్లు ఈవెంట్‌లో పాల్గొన్నారు. కిలోమీటరు మేరా ఉన్న విస్తీరణంలో 8 రౌండ్లుగా 10 కేటగిరీల మేరకు రేసర్లు పలు విన్యాసాలను ప్రదర్శించారు. వీటిని తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన బెంగళూరుకు చెందిన నేషనల్ రేసర్ సచిన్‌కు ఆల్‌రౌండ్ పర్‌ఫార్మర్ అవార్డు, అరుణ్‌కు ద్వితీయ, కరణ్‌కు తృతీయ బహుమతులను అందజేశారు. మహిళా రేసర్లలో జెస్సీ, షైతూరికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. వి.కోటలో అత్యుత్తమ ప్రమాణాలతో బైక్ రేసింగ్ నిర్వహించడం గర్వకారణంగా ఉందని మోటాక్సైట్ నిర్వాహకుడు పృథ్వీభాస్కర్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వ సహకారం అందితే ప్రపంచ స్థాయి రేసింగ్ నిర్వహించేందుకు తాము సిద్ధమని నిర్వాహకులు పృథ్వీ, జయదాస్‌మేనన్ తెలిపారు. బైక్ రేసింగ్ ఈవెంట్‌ను ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్ ప్రారంభించారు.

పుంగనూరులో టీడీపీ, వైసీపీ నేతలపై కేసులు

పుంగనూరు, జూన్16: పుంగనూరు తెలుగుదేశం, వైసీపీ నాయకులపై మూడు కేసులు పోలీసులు నమోదు చేశారు. శనివారం పుంగనూరులో వైసీపీ నాయకుడు వెంకటరెడ్డియాదవ్ ఇంటిపై దాడి చేశారని చేసిన ఫిర్యాదు మేరకు తెలుగుయువత నాయకుడు నవీన్, ఉమేశ్, ఎల్వీ రమణలపై కేసు నమోదు చేశారు. అలాగే పుంగనూరు మండలం ఈడిగపల్లె వద్ద మాజీ ఎంపీపీ నరసింహులుపై పుంగనూరు టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, గిరి మరికొందరు దాడి చేసి కులం పేరుతో దూషించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పుంగనూరు తెలుగు యువత నాయకుడు ఎల్.నవీన్‌పై వైసీపీ నాయకులు ఎన్.వెంకటరెడ్డియాదవ్, వెంకటరమణ, ప్రవీన్‌చిన్న, బి. వెంకటరెడ్డియాదవ్‌పై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

చిరుత ఘటనపై డీఎఫ్‌వో విచారణ

రామకుప్పం, జూన్ 16: తమిళనాడులో బంధించిన చిరుతను ఆంధ్రా అడవుల్లో వదిలారన్న వందతులపై చిత్తూరు డీఎఫ్‌వో చైతన్యకుమార్ రెడ్డి ఆదివారం విచారణ చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరులో కలకలం సృష్టించిన మగ చిరుతను తమిళనాడు అటవీ అధికారులు మత్తుమందు ఇచ్చి బంధించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రామకుప్పం మండలం వీర్నమల అటవీ ప్రాంతంలో వదిలారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో అటవీ సమీప ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో వీర్నమల అడవిలో చిరుతను వదిలారా.. లేరా అన్న కోణంలో డీఎఫ్‌వో విచారణ చేపట్టారు.

అటవీ శాఖలో ఇద్దరికి పదోన్నతులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 16: జిల్లా అటవీ శాఖలోని ఇద్దరు డిప్యూటీ రేంజ్ అధికారులకు ఫారెస్టు రేంజ్ అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఉత్తర్వులు జారీ చేశారు. జి.శ్రీరాములుకు పదోన్నతి కల్పిస్తూ పుంగనూరు రేంజ్‌లో ఎఫ్ఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. డి.గురప్పకు ఎఫ్ఆర్వోగా శ్రీసత్యసాయి జిల్లా కదిరి రేంజ్ ఎఫ్ఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నేపాల్‌లో పట్టుబడ్డ 173 టన్నుల ఎర్రచందనం

తిరుపతికి తీసుకొచ్చేందుకు సిద్ధమైన అటవీశాఖ అధికారులు ● ఇతర దేశాల నుంచి ఇలా తీసుకురావడం ఇదే తొలిసారి

మంగళం, జూన్ 16: అత్యంత విలువైన ఎర్రచందనాన్ని వివిధ మార్గాల్లో దేశం సరిహద్దులు దాటిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లు తాజాగా నేపాల్‌లో ఊహించని విధంగా అక్కడి అధికారులకు దుంగలతో పట్టుబడ్డారు. దాదాపు 173 టన్నుల ఎర్రచందనం దుంగలను ఆదేశంలోని అధికారులు పట్టుకున్నారు. అయితే అది ఎర్రచందనం అనేది వారికి తెలియదు. సాధారణంగా కలపను తరలించే సమయంలో అందుకు సంబంధించిన అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అనుమతులు లేకుండా తరలిస్తున్న ఈ ఎర్రచందనం దుంగలను సాధారణ కలపగా భావించి వారు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత విచారణలో ఇది కోట్ల రూపాయల విలువ చేసే ఎర్రచదనం దుంగలుగా గుర్తించారు. మనదేశంతో నేపాల్‌కు ఉన్న సత్సంబంధాల కారణంగా దీనిపై భారత ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించారు. దీనిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వ అధికారులు ఎర్రచందనం నిర్ధారణకు నేపాల్ వెళ్లేందుకు ఏపీ ప్రొడక్షన్ పీసీసీఎఫ్ ఖజూరియాకు ఆదేశాలిచ్చారు. నేపాల్‌కు వెళ్లిన ఆయన అక్కడి అధికారులు స్వాధీనం చేసుకుంది ఎర్రచందనం అని నిర్ధారించారు. దీంతో మేనెల నుంచి 90 రోజుల్లో నేపాల్‌లో పట్టుబడ్డ ఎర్రచందనాన్ని భారత్‌కు తీసుకురావడానికి మన ప్రభుత్వం అనుమతులు కూడా ఇచ్చింది.

అధికారులు నేపాల్ వెళ్లడానికి ఏర్పాట్లు పూర్తి

ఈనెల 20వ తేదీన తొమ్మిది మంది ఏపీ అటవీ శాఖ అధికారుల బృందం నేపాల్‌కు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ బృందంలో పీసీసీఎఫ్ ఖజూరియా, విజయనగరం జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్, ఎఫ్‌డీవో అప్పిరెడ్డి, తిరుపతికి చెందిన సెంట్రల్ గోదాము డీఎఫ్‌వో శివకుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో లక్ష్మీపతి, ఎఫ్ఎస్‌వోలు చైతన్య, రమేష్, ఎఫ్‌బీవోలు వేణుగోపాల్, వర్ధన్‌కుమార్‌లున్నారు. ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు ఈ బృందం నేపాల్‌లో ఉన్న 173 టన్నుల ఎర్రచందనాన్ని తిరుపతిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద ఉన్న సెంట్రల్ గోడౌన్‌కు తీసుకొచ్చి భద్రపరచనున్నారు. ఇతరదేశాల్లో పట్టుబడ్డ ఎర్రచందనాన్ని మన దేశానికి తరలించడం ఇదే తొలిసారి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేత్రపర్వంగా వేణుగోపాలుడి కల్యాణోత్సవం



గుడుపల్లె, జూన్ 16: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామంలో కొలువైన వేణుగోపాలుడి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అర్చకులు శాస్త్రోక్తంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వేణుగోపాలుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. గ్రామంలోని మహిళలు ఫల, పుష్ప, తాంబూలాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలుడి ఉత్సవర్లను పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు కర్పూర హారతులు పట్టారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీవారు భక్తులకు అన్నదానం చేశారు.

హనుమాన్ పురస్కారాల ప్రదానం



గంగవరం, జూన్ 16: సమాజ సేవలో ఉత్తమ సేవలు అందిస్తున్న 116 మంది సేవకులకు శ్రీరామ భక్త హనుమాన్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఆదివారం పలమనేరు మండలంలోని పెంట గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ, ఏఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలకుకు పురస్కారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్య, వైద్యం, సామాజిక సేవతో పాటు అన్నిరంగాల్లో సేవలందిస్తున్న వారి సేవలను గుర్తించి వారికి శ్రీరామ భక్త హనుమాన్ పురస్కారంతో పాటు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ పురస్కారాలను దలవాయి గుర్రప్పనాయుడు, చిరంజీవి భాగవతార్, ఆవిలాల శ్రీధర్, పెంజేటి తిప్పక్క, జ్యోతికుమార్, జింకా లక్ష్మీనారాయణ, రవికుమార్ బాబు, పగడాల మధుమోహన్, మల్లిక, యోగా గురు నందగోపాల్, చంద్రన్న, మనోజ్ కుమార్, మనోజ్‌కుమార్‌పాటు మొత్తం 116 మందికి పురస్కారాలను ప్రదానం చేశారు.

తిరుపతిలో పుంగనూరు కవులకు సన్మానం



పుంగనూరు, జూన్16: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కవితోత్సవం కార్యక్రమంలో పుంగనూరు కవులను ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలల నుంచి 145 మంది కవులతో జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. నవసమాజం, పర్యావరణ పరిరక్షణ, తల్లిప్రేమ వంటి కవితలు పాఠకులకు వినిపించి తమ ప్రతిభ కనబరిచినట్లు కవులు హసీనాబేగం, సాల్వరాజు సతీశ్‌రాజులు తెలిపారు. దీంతో ఏపీ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి ఉషారాణి చేతుల మీదుగా జ్ఞాపిక, శాలువ, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ కలయిక



చౌడేపల్లె, జూన్16: చౌడేపల్లె హైస్కూల్లో 1992-93 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల ఆదివారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ప్రజాపాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం



రామకుప్పం, జూన్16: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజాపాలన అందించడమే ధ్యేయంగా పనిచేస్తుందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగురైతు కార్యదర్శి నాగభూషణ,ం ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్ తెలియజేశారు. ఆదివారం బల్ల పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ జెండాను ఆవిష్కరించారు.

కాణిపాకంలో మొక్కు తీర్చుకున్న జనసేన నాయకులు

గంగవరం, జూన్ 16: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడంతో పలమ నేరు నియోజకవర్గంలోని జనసేన నాయకులు ఆదివారం కాణిపాక వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చు కున్నా రు. అనంతరం ఆ సంఘ నాయకులు పూలచైతన్య మాట్లాడుతూ పిఠాపురంలో పవన్‌కళ్యాణ్, పలమనేరులో అమరనాథరెడ్డి, తిరుపతిలో శ్రీనివాసులులు గెలుపొందాలని గతంలో మొక్కు కున్నామని తెలియజేశారు. కోరిక నెరవేరడంతో స్వామివారిని దర్శించుకున్నామని వివరించారు. కూటమి అధ్వర్యంలో ప్రజలకు మంచి పరిపాలన అందుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పూల ప్రభాకర్, హరిబాబు, మహేష్, హరి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కుప్పం, జూన్ 16: కుప్పం సాయి మాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కుప్పం ప్రభుత్వ పాఠశాలలో బెంగళూరు శరకర కంటి ఆస్పత్రి వారిచే ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ గ్రామాల నుంచి 250 మంది దాక కంటి సమస్యలతో జనం వచ్చారు. వైద్యులు 89 మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. బెంగళూరులో వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్లు సాయిమాతా సేవా ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివ లావణ్య, నేత్ర, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ అధ్యక్షుడి మృతి



మృతి చెందిన మనోహర్‌రెడ్డి

గంగవరం, జూన్ 16: పలమనేరు తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మనోహర్ రెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్నట్లుండి ఛాతీలో నొప్పి రావ డంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే పలమనేరు ప్రభుత్వా స్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పలువురు పెన్షనర్ల సంఘ సభ్యులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

అమర్ ఇంటివద్ద సందడే సందడి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

గంగవరం, జూన్ 16: ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇంటి వద్ద అధికారులు, నాయకుల రాకతో సందడి నెలకొంది. కొత్తప్రభుత్వం కొలువుదీరిన తరువాత మొదటి సారిగా ఆయన శనివారం రాత్రి పలమనేరులోని వారి స్వగృహం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు, ఎస్బీ, ఇంటెలిజెన్స్ సిబ్బంది, రెవిన్యూ, పంచాయతీరాజ్, ఎన్‌జీఓ సంఘ నాయకులతో పాటు టీడీపీ, జనసేన, మైనార్టీ నాయకులు, పార్టీల నాయకులు, బార్ అసోసి యేషన్ సభ్యులు, అభిమానులు, స్థానికులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పూలమాలలతో సత్కరించారు.

కిటకిటలాడిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, దర్శనం కోసం క్యూలైన్ల లో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, జూన్16: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభి షేకాలు నిర్వహించి, స్వర్ణాభరణాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అధికారులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

ఉద్యోగులు అండగా కూటమి ప్రభుత్వం : అమర్



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఎన్జీఓ సంఘ నేతలు

గంగవరం, జూన్ 16: కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి భరోసానిచ్చారు. ఆదివారం పలమనేరు ఎన్జీఓ సంఘ నాయకులు ఆయన్ను కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యలపై కాసేపు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరించడంతోనే ఇంటికి సాగనంపారన్న విషయాన్ని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అలాచేయబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికీ అందించేందుకు కలసి కృషిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, కార్యదర్శి జయమ్మ, హరి, రమణ, సోమసుందర్‌రెడ్డి, శ్రీనివాసులు, కుమార్, దామోదర్ నాయుడు, రమేష్, చిన్నప్పయ్య, వల్లెమ్మ, బాలాజి, విజయ్ హైదర్, మస్తాన్, వినయ్, రేవతి, నాగవేణి, రఘురామ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా.. తండ్రీకుమారులకు గాయాలు



గాయపడ్డ కృష్ణప్ప, చిన్నారులు జగదీష్, చక్రవర్తి

చౌడేపల్లె, జూన్16: బోయకొండపై ద్విచక్రవాహనం బోల్తా పడడంతో ముగ్గురికి తీవ్రగాయాల య్యాయి. ఈ ఘటన ఆదివారం జరిగింది. ఆదివారం పలమనేరు సమీపంలోని చిన్నూరుకు చెందిన కృష్ణ(30) తన కుమారులైన జగదీష్(10), చక్రవర్తి(7)తో కలిసి బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వచ్చారు. దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో కొండపై ఉన్న రణబేరి గంగమ్మ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. కృష్ణ కాలు విరిగింది. చిన్నారులు జగదీష్, చక్రవర్తిలకు తీవ్రగాయాల య్యాయి. గాయపడ్డవారిని భక్తులు 108లో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాక్షసపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాక్షసపాలన నుంచి రాష్ట్రం విముక్తి అయిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం ఏపీకి శుభసూచికమన్నారు. కేంద్రప్రభుత్వంలో భాగస్వాములం కావడడం ద్వారా వందకు వంద శాతం పోలవరం, అమరావతి, జాతీయ రహదారులతోపాటు జాతీయ ప్రాజెక్టులు సాధించుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఎన్డీయే కూటమి రానున్న ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తును మార్చేస్తుందనేందుకు నిదర్శనంగా సీఎంగా ప్రమాణస్వీకారం చేశాక చంద్రబాబు ఐదు సంతకాలు చేశారన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణి పాకం), జూన్ 16: కాణిపాక ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా అక్కంపేటకు చెందిన నరేంద్రరెడ్డి ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ విష్ణేష్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణం



గంగాధరనెల్లూరు, జూన్ 16: మండలంలోని వేపంజేరి గ్రామంలో లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సం నిర్వహించారు. చిత్తూరు సంతపేటకు చెందిన కల్యాణి, నాగేంద్ర దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపం ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలను ఆలపించారు.

భక్తిశ్రద్ధలతో రామకోటి



చౌడేపల్లె, జూన్16: బిల్లేరులో వెలసిన రామాలయంలో భక్తిశ్రద్ధలతో రామకోటి నిర్వహించారు. ఆదివారం ఆలయ నిర్వాహకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆనంతరం భక్త బృందం రామకోటిని నిర్వహించారు.

గంగమ్మకు విశేష పూజలు



సోమల, జూన్ 16: సోమల బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. రాష్ట్రంలో జనసేన కూటమి ప్రభు త్వం ఏర్పాటుతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమల, నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లె, చిన్నఉప్పరపల్లె, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు



పుంగనూరు రూరల్, జూన్16: మండలంలోని భీమగానిపల్లెలో వెలసిన భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయాన్నే స్వామి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజల ప్రభుత్వం గెలిచింది: టీడీపీ

పుంగనూరు రూరల్, జూన్16: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ప్రభుత్వం గెలిచిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మేలుందొడ్డి పంచాయతీ గోపిశెట్టిపల్లె గ్రామంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలనలో పేదల భూములను పరిశ్రమల పేరుతో లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, గంగాధర్, ప్రసాద్, సుకుమార్, శంకరప్ప, భాస్కర్, చిన్నా, చలపతి, శ్రీనివాసులు, వెంకటస్వామి, వెంకటరమణ, నాగరాజరెడ్డి, మణి పాల్గొన్నారు.

నల్ల గంగమ్మకు పూజలు



ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సోమల, జూన్ 16: మండలంలోని నెలుకూరిపల్లె వద్ద వెలసిన నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చని తోర ణాలతో అలంకరించారు. ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించారు. అన్నదానాలు చేశారు. వడ్డిపల్లె, భారతంమిట్ట, సోమల, రాశెట్టివారిపల్లె తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కళామందిరం పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గంగవరం, జూన్ 16: కళామందిరం ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా తెలుగు భాషారక్షణకు కృషిచేస్తున్న వారు తమ వివరాలను ఈ నెల 30వ తేదీ లోపు గంగవరం కళామందిరానికి పంపాలని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భాషాభివృద్ధి, సాహిత్యాలకి కృషిచేస్తూ, సేవచేస్తున్న వారు ఈ నెల 30వ తేదీలోపల పి.తులసీనాథం నాయుడు, కళామందిరం, సాయిగార్డెన్ సిటీ, గంగవరం, చిత్తూరు జిల్లా అనే చిరునామాకు పంపాలని కోరారు. జూలై 7వ తేదీన వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పురస్కారాలు ప్రదానం చేస్తామని వివరించారు.

అపరిశుభ్రంగా డైట్ పరిసరాలు

కార్వేటినగరం, జూన్ 16: స్థానిక డైట్ పరిసరాలు అపరిశుభ్రంగా దర్శన మిస్తున్నాయి. బాలికల హాస్టల్ వెనుక వైపు ఉన్న తారురోడ్డుపై ఆకులు, చెత్తాచెదారం పేరుకుపోయాయి. పరిసరాల్లోనూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇందులో విష పురుగులు చేరే అవకాశం కనిపిస్తోంది. డైట్‌లో చేరేందుకు కొత్తగా వస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరిసరాలను చూసి, అసహనానికి గురవుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

సోమల గ్రంథాలయం మూత



సోమల, జూన్ 16: సోమల శాఖా గ్రంథాలయం నిరంతరం మూతపడి ఉంటోంది. ఐదు నెలలుగా తాళం వేయడంతో పాఠకులకు దినపత్రికలు సైతం అందుబాటులో లేకపోతున్నాయి. గత నెలలో విద్యార్థులకు వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు నిర్వహించలేదు. 2023 డిసెంబరులో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం వర్కర్ రామకృష్ణ ఉద్యోగ విరమణతో గ్రంథాలయానికి తాళం వేశారు. అన్నమయ్య జిల్లా కలికిరి గ్రంథాలయ అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన విధులకు రాపోలేదు. అదేసమయంలో జిల్లా అధికారులు పట్టించుకోక పోవడంతో గ్రంథాలయం మూతపడింది. గ్రంథాలయంలో 500 మందికి పైగా పుస్తక డిపాజిట్ చేసిన సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం వారికి పుస్తకాలు అందడం లేదు. దినపత్రికలు చదివే పాఠకులు నిత్యం గ్రంథాలయం వద్దకు వచ్చి తాళం చూసి నిరాశతో వెనుదిరిగి వెళుతున్నారు. అధికారులు స్పందించి గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

గుండ్లసాగరంలో గెరిగ గుట్ట ఆక్రమణలు తొలగించండి

గుడుపల్లె, జూన్ 16: కుప్పానికి కూత వేట దూరంలో గుండ్లసాగం గ్రామం ఉంది. ఈ గ్రామంలోని గెరిగ గుట్ట ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. నక్కనపల్లె రెవెన్యూలో సర్వే నెం. 129-1లో 4.28 ఎకరాల గుట్ట పోరంబోకు భూమి ఉంది. ఈ భూమి లక్షల్లో విలువ చేస్తుంది. గుండ్లసాగరానికి చెంది ఓ నాయకుడి భూమి పక్కనే ఈ గుట్ట పోరంబోకు ఉండడంతో ఈ భూమిపై అతడి కన్ను పడింది. గుట్టలో తెల్ల రంగు గ్రానైట్ నిక్షేపాలున్నాయి. కొన్ని నెలలుగా విలువైన గ్రానైట్ తీసి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గ్రానైట్ వెలికితీసేందుకు పేలుళ్లు చేపడుతున్నాడు. పేలుళ్ల వల్ల రాతి ముక్కలు రోడ్డుపైన, సమీప పొలాలపై పడుతున్నాయి. దీనిపై స్థానిక రైతులు, ప్రజలు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయింది. అలాగే ఆరు నెలల క్రితం అక్కడి భూమిని ఆక్రమించుకుని ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇందుకు కుప్పానికి చెందిన వైసీపీ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. కాగా గుండ్లసాగరంలో ఇళ్లు లేని పేదలు ఎంతో మంది ఉన్నారు. అధికారులు స్పందించి అలాంటి వారికి ఆక్రమిత స్థలంలో పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గెరిగ గుట్టలో మంత్రాలతో తొలగించిన గ్రానైట్, ఆక్రమిత భూమి

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అ'పూర్వ' కలయిక


పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 16: పూర్వ విద్యార్థుల కలయిక వారిలో ఆనందాన్ని నింపింది. స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఆదివారం పాఠశాలలో కలుసుకుని వజ్రోత్సవ సమ్మేళనం చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు, అనుభవాలను పంచుకున్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఇదే పాఠశాల విద్యార్థి కావడంతో ఈ సమ్మేళనంలో స్నేహితులతో సరదాగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన కోదండరామ, శోభలతలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు రెడ్డెప్ప, శ్రీనివాస్, చంద్రశేఖర్, జ్ఞానశేఖర్, రవీంద్రారెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి


నివాళులర్పిస్తున్న చిట్టిబాబు నాయుడు

శ్రీరంగరాజపురం, జూన్ 16: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మాన్యం శ్రీనివాసులు నాయుడు(75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. పాలసముద్రం మాజీ జడ్పీటీసీ చిట్టిబాబు నాయుడు టీడీపీ నేతలు ఆయన మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుమారులను పరామర్శించారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాన్యం సుబ్రమణ్యం నాయుడు, ఆనందనాయుడు, వేమనాయుడు, విశ్వనాథ నాయుడు, దేవరాజులు నాయుడు, గిరి నాయుడు, జ్యోతి నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణం


ఉభయదారులకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న మేనేజర్ వెంకటేష్

గంగాధరనెల్లూరు, జూన్ 16: మండలంలోని వేపంజేరి గ్రామంలో లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సం నిర్వహించారు. చిత్తూరు సంతపేటకు చెందిన కల్యాణి, నాగేంద్ర దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపం ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేషులురెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

చర్చిలో అన్నదానం



గంగాధరనెల్లూరు, జూన్ 16: జీడీ నెల్లూరు ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్ ఎన్నికైనందుకు, సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించినందుకు మండలంలోని కోటాగరం దళితవాడకు చెందిన టీడీపీ క్రిస్టియన్ సెల్ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రన్ ఆదివారం అన్నదానం చేశారు. స్థానిక చర్చిలో టీడీపీ నేతలతో కలిసి ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. టీడీపీ నేతలు స్వామినాథన్, బాబుప్రసాద్, సామివేలు, పట్టాభి, జ్యోతి, విజయకుమారి, నందిని, పూర్ణ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం


ఏఈవోకు డీడీ అందిస్తున్న దాత నరేంద్రరెడ్డి

ఐరాల(కాణిపాకం), జూన్ 16: కాణిపాక ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా అక్కంపేటకు చెందిన నరేంద్రరెడ్డి ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

చిట్టిబాబునాయుడికి ఎస్టీయూ సన్మానం



పాలసముద్రం, జూన్ 16: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడును ఎస్టీయూ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్, చిత్తూరు ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావు గెలుపొందడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు కోదండయ్య, ప్రకాష్, రఘు, దొరస్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'బండి కూడు'



పాలసముద్రం, జూన్ 16: మండలంలోని కృష్ణజిమ్మాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన బకాసురుడు బండికూడు కార్యక్రమం ఆకట్టుకుంది. ఆలయ పరిధిలోని కృష్ణజిమ్మాపురం, బలిజకండ్రిగ, కొత్తపల్లి, ఎగువ కొత్తపల్లి గ్రామాల్లో బకాసురుడు వేషధారితో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దా నైవేద్యం సమర్పించారు.

పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలి

పెనుమూరు, జూన్ 16: మండలంలోని పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్పీ సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ ప్రాంతంలో అనేక వనరులున్నప్పటికీ గత ఐదేళ్లుగా అభివృద్ధి జరగలేదని తెలిపారు. పులిగుండులో ట్రెక్కింగ్, రోప్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్టీఆర్ జలాశయం వద్ద పార్కు, బోటింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. జలాశయం నుంచి 32 చెరువులను అనుసంధానం చేస్తే వేలాది ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. కలికిరికొండకు పూతలపట్టు నుంచి రోడ్డు మార్గం, తిరుపతి నుంచి పెనుమూరు మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. నేంద్రగుంట నుంచి పెనుమూరుకు డబుల్ రోడ్డు, పెనుమూరులో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు, కలెక్టర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు.

ఈడిగ కులస్థులపై దాడి బాధాకరం


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నేతలు

బంగారుపాళ్యం, జూన్ 16: యాదమరి మండలం మోటాండ్లపల్లికి చెందిన ఈడిగ కులస్థులపై వైసీపీకి చెందిన అగ్రకులాల వారు దాడి చేయడం బాధాకరమని రాష్ట్ర గౌడ సంఘం కార్యదర్శి బుస్సా నాగరాజ్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నలగాంపల్లెలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా ఈడిగ కులస్థులు గ్రామ సమీపంలోని కాటమరాజు గుడిలో పూజలు చేసుకుంటుండగా శనివారం అగ్ర కులస్థులు దాడిచేయడం దారుణమన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఈడిగసంఘం ఉపాధ్యక్షుడు జనార్దన్ గౌడ్, గౌడ యువసేన ప్రధాన కార్యదర్శి మురళీగౌడ్, మాధవరావ్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

భానుప్రకాష్‌కు సన్మానం



విజయపురం, జూన్ 16: నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భానుప్రకాష్‌ను మండలంలోని మాధవరం, ఇళ్లత్తూరులో ఆదివారం టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. మాధవరానికి చెందిన సెల్వం, ఇళ్లత్తూరులో ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు జయరాజ్, సెల్వం, మునిభాస్కర్‌రాజు, గోవిందరాజులు, వేలు, ఆర్ముగం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరి : మండల పరిధిలోని తడుకుపేటలో చంద్రశేఖర్ నాయుడు మనుమడి నామకరణంలో పాల్గొని, చిన్నారితో సహా తలిదండ్రులను ఆశీర్వదించారు. రాజులకండ్రిగలో ఓ శుభకార్యంలో పాల్గొన్నారు. చింతలపట్టెడలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు బాలాజీ, పురుషోత్తంనాయుడు, వంశీరాజ్, నారాయణస్వామి నాయుడు, దేవా, భూపతి, వరదరాజులు, కామేష్, మోహన్ రావ్, ఐవీ నాయుడు, నరసింహులునాయుడు పాల్గొన్నారు.

నింద్ర : నగరి ఎమ్మెల్యేగా గెలిచిన గాలి భాను ప్రకాష్‌ను ఆదివారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో నింద్రకు చెందిన టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఘనంగా సన్మానించారు.

అపరిశుభ్రంగా డైట్ పరిసరాలు



కార్వేటినగరం, జూన్ 16: స్థానిక డైట్ పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. బాలికల హాస్టల్ వెనుక వైపు ఉన్న తారు రోడ్డుపై ఆకులు, చెత్తాచెదారం పేరుకు పోయాయి. పరిసరాల్లోనూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇందులో విష పురుగులు చేరే అవకాశం కనిపిస్తోంది. డైట్‌లో చేరేందుకు కొత్తగా వస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరిసరాలను చూసి, అసహనానికి గురవుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

తెలుగు పండిట్‌కు సన్మానం



కార్వేటినగరం, జూన్ 16: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మాధవరెడ్డికి ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. విద్యా రంగానికి, తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను ఎస్టీయూ నేత గాజుల నాగేశ్వరరావు కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన కుంభాభిషేక వేడుకలు



నగరి జూన్16: మున్సిపాలిటీ పరిధిలోని కళిమిట్ట వద్ద గల మహామునేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న కుంభాభిషేక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు మహిళా భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పలు హోమాలు నిర్వహించి దీపారాధన చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నాయకులు కేజేకుమార్, కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతి నాయుడు, శ్రీనివాసులు, రాజశేఖర్, సింగిల్ విండో సీఈవో తులసిపిళ్లై స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా దుర్యోధన వధ



శ్రీరంగరాజపురం, జూన్ 16: మండల కేంద్రంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ వైభవంగా నిర్వహించారు. భీముడు, దుర్యోధనుడి పాత్రధారులు పద్యాలు పాడుతూ యుద్ధానికి తలపడడం ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో మట్టితో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ధర్మకర్త వేణు నాయుడు, నారాయణస్వామి నాయుడు, రాజశేఖర్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, కేశవులు నాయుడు, ఎత్తిరాజులు నాయుడు, అంజనేయులు నాయుడు, మాధవ నాయుడు, హరిత, కుప్పయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ నీరు ఎక్కడ?

నీటిశుద్ధి కేంద్రాల నిర్వహణ గాలికి..



నింద్రలో నిరుపయోగంగా ఉన్న శుద్ధి కేంద్రం

నింద్ర, జూన్ 16: గ్రామీణులకు స్వచ్ఛ నీరు కలగానే మిగులుతోంది. స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మండలంలో శుద్ధి కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. మండల కేంద్రమైన నింద్రలో రూ.2.5 లక్షలతో నిర్మించిన కేంద్రం మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొప్పేడులో నిధులున్నా అసంపూర్తిగా పనులు వదిలేశారు. అత్తూరులో నిర్వహణ లోపంతో కేంద్రం నిరుపయోగంగా మారింది. మిగిలిన చోట్లా ఏదో ఒక సమస్యతో కేంద్రాలు పనిచేయడం లేదు. ఈ క్రమంలో స్వచ్ఛనీటికి అలవాటుపడిన ప్రజలు ప్రైవేటు వ్యాపారుల నుంచి డబ్బు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంజేరయ్య వివరణ కోరగా నీటిశుద్ధి కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీలకు అప్పగించామని, మరమ్మతులు, నిర్వహణ, వ్యయం ఇలా ఏదైనా వారే చూసుకోవాలని తెలిపారు.

హామీల అమలుపై హర్షం


అన్నదానం చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, జూన్ 16: సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు హామీల అమలుకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని మొగరాలపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ హరినాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీటీసీ సాంబశివ నాయుడు, రామూర్తి నాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు అడ్డుకుంటున్నారు


మాట్లాడుతున్న ఇంద్రాణి

చిత్తూరు సిటీ, జూన్16: తండ్రి నుంచి వచ్చిన భూమిలో వ్యవసాయం చేయనీయకుండా అడ్డుకుంటున్నారని పెనుమూరు మండలం పలికల్లు పంచాయతీ బుక్కిరెడ్డిపల్లెకు చెందిన ఇంద్రాణి తెలిపారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె తన తండ్రితో కలసి విలేకరులతో మాట్లాడారు. తండ్రికి 20 ఏళ్ల క్రితం రూ.75 వేలు అప్పుగా ఇచ్చానన్నారు. అప్పు తీర్చలేక ఐదేళ్ల క్రితం తనకు 4.15 ఎకరాల వ్యవసాయ భూమిని రాసిచ్చారన్నారు. అయితే తన అన్న కొడుకు మూడేళ్లుగా ఆ భూమిలోకి రానీయకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



కేక్ కట్ చేస్తున్న గురజాల - శుభాకాంక్షలు చెబుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జూన్ 16: చిత్తూరు ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నికైన దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సోదరభావంతో మెలుగుతూ త్యాగాలకు ప్రతీకగా చెప్పే బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కాస్ భవన నిర్మాణానికి సహకరించండి

చిత్తూరు కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం (కాస్) భవన నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను ఆ సంఘం నేతలు కోరారు. ఆదివారం స్థానిక బీవీ రెడ్డి కాలనీలో వారు ఎమ్మెల్యేను కలసి సన్మానించారు. కాస్ సంఘం కార్యదర్శి సాపినేని సతీష్ పాల్గొన్నారు.

టీడీపీ సంబరాలు

కూటమి విజయం సాధించడంపై మురకంబట్టు సర్కిల్‌లో టీడీపీ నేతలు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన గురజాల జగన్మోహన్ కేక్ కట్‌చేసి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. త్యాగరాజన్, బాబురెడ్డి, రాజశేఖర్, తిరుకుమరన్, నిత్యానందం, ఉదయ్, గోపి, నాగరాజు, కుమరవేలు, మూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీటీసీ

గుడిపాల : చిత్తూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన గురజాల జగన్మోహన్‌ను గుడిపాల సెగ్మెంట్ ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ చౌదరి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

హింస, దౌర్జన్యాలు సహించను : థామస్


థామస్‌ను స్వాగతిస్తున్న చైతన్యరెడ్డి బృందం

వెదురుకుప్పం/ కార్వేటినగరం/ పాలసముద్రం జూన్ 16: హింసా, దౌర్జన్యాలను సహించనని, వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడినా హింసకు దూరంగా ఉండాలని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ వీఎం థామస్ అన్నారు. ఆయన ఎమ్మెల్యే హోదాలో ఆదివారం రాత్రి తొలిసారిగా వెదురుకుప్పంకు వచ్చారు. గెరిగిడొన, పచ్చికాపల్లం, ధర్మాచెరువు, మాంబేడు, వెదురుకుప్పం ప్రాంతాల్లో కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. వెదురుకుప్పంలో పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చడానికి శాయశక్తుల కృషి చేస్తామని చెప్పారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షులు బండి ఢిల్లీప్రసాద్‌రెడ్డి, బండి పరమేశ్వరరెడ్డి, తెలుగు యువత గురుసాల కిషన్‌చంద్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

థామస్‌కి సన్మానాలు

థామస్‌కు చైతన్య కన్‌స్ట్రక్షన్ అధినేత, టీడీపీ యువనేత కామసాని చైతన్యరెడ్డి బృందం ఆదివారం ఘనస్వాగతం పలికింది. ఆదివారం వెదురుకుప్పంకు రావడంతో గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనాథరెడ్డి, రాజేంద్రరెడ్డి, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు. కార్వేటినగరంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి, సన్మానించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రాజు, చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరాజు, టీడీపీ మండల నాయకులు చెంగల్ రాయల్ యాదవ్, రాజేందర్ రెడ్డి, జగన్నాథం, గణేష్ రాజు, గోపాలరాజు, రవియాదవ్ పాల్గొన్నారు. పాల సముద్రం మండలం నుంచి టీడీపీ నాయకులు భీమనేని చిట్టిబాబు నాయుడు, వాసు నాయుడు, శేఖర్‌రాజు, రవినాయుడు, తంగరాజ్, అరుళ్‌నాథన్, సాంబశివన్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన బోయకొండ


గంగమ్మ దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, జూన్16: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వర్ణాభరణాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అధికారులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేలకు శుభాకాంక్షల వెల్లువ


మురళీమోహన్‌ను శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 16: చిత్తూరు పార్లమెంటు పరిధిలో గెలిచిన ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళి మోహన్, థామస్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నేతలు కోదండయాదవ్, మహేష్ నాయుడు, వెంకటేశ్వర చౌదరి, నాగేశ్వరరాజు, మణి నాయుడు, చెంగ్రాలాయ యాదవ్, మోహన్ నాయుడు, మహేంద్రయాదవ్, హేమాద్రి, రవియాదవ్ తదితరులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల సొమ్ముతో జగన్ సోకులు : టీడీపీ

గుడిపాల, జూన్ 16: మాజీ సీఎం జగన్ ప్రజల సొమ్ముతో గడిచిన ఐదేళ్లు సొంత పనులు చేసుకున్నారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రుషికొండలో రూ.500 కోట్ల ప్రజాధనంతో ఏపీ టూరిజం పేరిట ప్యాలెస్ నిర్మించుకోవడం దారుణమన్నారు. ఆయన మళ్లీ సీఎం అయ్యుంటే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేవాడని, ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి వచ్చేదని అన్నారు. సరైన సమయంలో ప్రజలు మంచి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు

చిత్తూరు కల్చరల్, జూన్ 16: నగరంలో సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈద్గాల వద్ద ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా షామియానాలు, తాగునీరు తదితరాలను సమకూర్చింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

రామానుజ ట్రస్టు నూతన కార్యవర్గం

చిత్తరు కల్చరల్, జూన్ 16: నగరంలోని కోదండరామాలయంలో ఆదివారం రామానుజ ట్రస్టు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా వి.రామమూర్తి, అధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా వేణుగోపాల్, కార్యదర్శిగా వరదరాజన్, సంయుక్త కార్యదర్శిగా సంతోష్ కుమార్, కోశాధికారిగా శ్రీరామ్, కార్యవర్గ సభ్యులుగా గిరిధరన్, సత్యనారాయణ, నారాయణ, సంపత్‌కుమార్, బాలాజి, మురళి, ఆనందకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రమాదకరంగా కేబుల్ గోతులు



కార్వేటినగరం, జూన్ 16: కార్వేటినగరం మండలం కృష్ణాపురం లో మూడు రోడ్ల కోసం కూడలి ప్రాంతంలో తవ్విన గోతులు అటు వైపుగా ప్రయాణించే వారికి ప్రమాదకరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. కేబుల్స్ వేయడానికి తవ్విన గోతులును మట్టితో కప్పి, చదను చేయకపోవడంతో రాత్రి పూట ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని వారు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే గోతులను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై వారపు సంత

వాహన దారులకు తప్పని తిప్పలు



నగరి, జూన్ 16: నగరి పట్టణ పరిధిలో ప్రతి శుక్రవారం జరిగే వారపు సంత రోడ్డుపైకి రావడంతో వాహన దారులలకు తిప్పలు తప్పడం లేదు. సంతకు ప్రత్యేక గదులు లేకపోవడం దినసరి మార్కెట్ కోసం పునాదులు వేసి వదిలి వేయడంతో స్థలం చాలక రోడ్డుపైన దుకాణాలు పెట్టుకోవడంతో శుక్రవారం అయితే చాలు వాహనదారులు తిప్పలు తప్పడం లేదు. సుమారు గంటసేపు నిలుచుకుంటే తప్ప వాహనాల్లో వెళ్ళడానికి వీలు కావడం లేదు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆశిస్తున్నారు.

శిథిలావస్థలో సింగిల్‌విండో భవనం



విజయపురం, జూన్ 16: మండలంలోని ఎం.అగరంలో సింగిల్‌విండో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో గతంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేవారు. ఏడు సంవత్సరాలుగా దీని నిర్వహణ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుందని, అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలెన్నో!



పాలసముద్రం, జూన్ 16: చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలోని పాల సముద్రం మండలం అయ్యప్పరాజు కండ్రిగ బస్టాపు వద్ద రోడ్డు గుంతలమయమైంది. వర్షాలకు గుంతల్లో నీరు చేరి, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆరు నెలల క్రితం శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ మహేష్ నాయుడు గుంతలకు మట్టి తోలించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఆ మట్టి కొట్టుకుపోయి గుంతల్లో నీరు చేరి, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.